ధాన్యం కొనుగోళ్లలో ప్రభుత్వం విఫలం

గజ్వేల్ కొనుగోలు కేంద్రంలో మార్కెట్ అధికారులతో మాట్లాడుతున్న ఎఫ్‌డీసీ మాజీ చైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డి

- రోడ్లపైనే వేలాది క్వింటాళ్ల ధాన్యం రాశులు
- అకాల వర్షాలకు తడిసిన వడ్లను కొనుగోలు చేయాలి
- బీఆర్‌ఎస్ గజ్వేల్ నియోజకవర్గ ఇన్‌చార్జి వంటేరు ప్రతాప్‌రెడ్డి

గజ్వేల్, మే 19: కేంద్రాల్లో ధాన్యాన్ని నత్తనడకన కొనుగోళ్లు చేస్తున్నారని, ధాన్యం కొనుగోళ్లలో ప్రభుత్వం విఫలమైందని బీఆర్‌ఎస్ గజ్వేల్ నియోజకవర్గ ఇన్‌చార్జి వంటేరు ప్రతాప్‌రెడ్డి ఆరోపించారు. సోమవారం గజ్వేల్ వ్యవసాయ మార్కెట్‌లో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆయన సందర్శించి అక్కడి రైతులతో మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ రోడ్ల వెంట వేలాది క్వింటాళ్ల ధాన్యం ఉందని, కాంగ్రెస్ ప్రభుత్వానికి చిత్తశుద్ధి లేదని, వసతులు సమకూర్చడంలో విఫలమైందన్నారు. అకాల వర్షాలతో ధాన్యం తడవడంతో రైతులు ఇబ్బంది పడుతున్నారని, తడిసిన ధాన్యాన్ని పూర్తి స్థాయిలో కొనుగోలు చేయాలన్నారు. ధాన్యం మ్యాచూర్ ఉన్నా సకాలంలో కొనుగోలు చేయకపోవడంతో రైతులు దళారులను ఆశ్రయించి తక్కువ ధరకు అమ్ముకునే పరిస్థితిని ప్రభుత్వమే తీసుకొచ్చిందన్నారు. రైతుల నుంచి దళారులు అందినకాడికి దోచుకుంటూ సొమ్ము చేసుకుంటున్నారన్నారు. తడిసిన ధాన్యాన్ని కొంటున్నామని ప్రభుత్వం చెప్పడం విడ్డూరంగా ఉందన్నారు. రోడ్లపైనే ధాన్యం ఉండడంతో బైక్‌లు అదుపుతప్పి ప్రమాదాలకు గురవుతున్నారన్నారు. విత్తనాలు వేసుకునే సీజన్ వచ్చినా ప్రభుత్వానికి చీమకుట్టినట్లు కూడా లేదన్నారు. ఇప్పటికైనా త్వరగా ధాన్యం కొనుగోళ్లు చేయాలని కోరారు. సన్నవడ్లకు బోనస్ చెల్లించాలని, రైతులు అమ్ముకున్న ధాన్యానికి వెంటనే డబ్బులను బ్యాంకు ఖాతాల్లో జమచేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు గుంటుక రాజు, కనకయ్య, మల్లేశం, ప్రవీణ్ పాల్గొన్నారు.

కొనుగోలు కేంద్రాన్ని సందర్శించిన అదనపు కలెక్టర్

సిద్దిపేట,మే19: కొనుగోలు చేసిన ధాన్యాన్ని వెంటనే రైస్ మిల్లులకు తరలించాలని అదనపు కలెక్టర్ అబ్దుల్‌హమీద్ అధికారులకు సూచించారు. సోమవారం డీఎం సివిల్ సప్లయ్ అధికారి ప్రవీణ్, జిల్లా సహకార అధికారి నాగేశ్వరరావుతో కలిసి ఆయన సిద్దిపేట రూరల్ మండలం బండచర్లపల్లిలోని పీఏసీఎస్ ఆధ్వర్యంలోని ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా కొనుగోలు కేంద్రం నిర్వాహకులు రైతుల నుంచి సేకరించిన ధాన్యాన్ని మిల్లుకు తరలించేందుకు హమాలీలా కొరత ఉందని అదనపు కలెక్టర్ దృష్టికి తీసుకువచ్చారు. అదనపు కలెక్టర్ వెంటనే జిల్లా సహకార అధికారి, స్థానిక తహసీల్దార్‌తో మాట్లాడి హమాలీల సమస్య పరిష్కరించారు. కార్యక్రమంలో స్థానిక తహసీల్దార్ పాల్గొన్నారు.

బండచర్లపల్లిలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని సందర్శించిన అదనపు కలెక్టర్ అబ్దుల్‌హమీద్

విగ్రహావిష్కరణలు ఘనంగా నిర్వహించాలి

ఆర్థికసాయం అందజేస్తున్న మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్‌రావు

మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్‌రావు

నంగునూరు, మే 19 : మండలంలోని పాలమాకుల, జేపీతండా పరిధిలో ఏర్పాటు చేసిన ముదిరాజు ముద్దు బిడ్డలు, పోరాట యోధులు పండుగ సాయన్న ముదిరాజ్, కొరవి కృష్ణస్వామి ముదిరాజ్ విగ్రహావిష్కరణలు ఘనంగా నిర్వహించాలని మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్‌రావు కోరారు. ఆదివారం రాత్రి సిద్దిపేట పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ముదిరాజ్ సంఘం ప్రతినిధులకు ఆయన రూ.లక్ష ఆర్థికసాయం అందజేశారు. ఈ సందర్భంగా హరీశ్‌రావు మాట్లాడుతూ.. ప్రజావీరులు, ముదిరాజ్ కులం కోసం పోరాడిన త్యాగధనులు పండుగ సాయన్న ముదిరాజ్, కొరవి కృష్ణస్వామి ముదిరాజ్ విగ్రహాలు పాలమాకులలో ఏర్పాటు చేసుకోవడం వారి ఆశయాలు కొనసాగించడమే అని, అలాంటి మహనీయుల పోరాటం భావితరాలకు తెలియజేసేందుకు విగ్రహాలు ఏర్పాటు చేస్తామన్నారు. ఆర్థిక సహాయం అందించిన హరీశ్‌రావుకు ముదిరాజ్ సంఘం నాయకులు కృతజ్ఞతలు తెలిపారు.

చినజీయర్ స్వామికి స్వాగతం పలుకుతున్న ఎమ్మెల్యే హరీశ్‌రావు

చినజీయర్ స్వామికి స్వాగతం పలికిన హరీశ్‌రావు

సిద్దిపేట, మే 19: సిద్దిపేటలోని మోహినీపురవేంకటేశ్వరస్వామి స్వర్ణోత్సవాల్లో భాగంగా సోమవారం స్వామివారిని చినజీయర్‌స్వామి దర్శించుకున్నారు. చినజీయర్ స్వామికి మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే తన్నీరు హరీశ్‌రావు స్వాగతం పలికారు.

శిక్షణ శిబిరంలో వసతులు కల్పించాలి

మర్కూక్, మే19: మండలంలోని ఎమ్మార్సీ భవనంలో నిర్వహించే ఉపాధ్యాయుల వేసవి శిక్షణ శిబిరంలో ఉపాధ్యాయులకు వసతి సదుపాయం, భోజనం, తాగునీరు, విద్యుత్ సరఫరా తదితర వసతులు ప్రభుత్వమే సమకూర్చాలని ఉపాధ్యాయ సంఘాల నేతలు మండల విద్యాధికారి వెంకట్రాములుకు సోమవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. ఉపాధ్యాయులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ప్రభుత్వం తగు ఏర్పాట్లు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో పీఆర్టీయూ ఉపాధ్యాయ సంఘం నాయకులు పాల్గొన్నారు.

బ్రిడ్జి నిర్మాణ పనులు పూర్తి చేయాలి

చేర్యాల, మే 19 : జనగామ, సిద్దిపేట జాతీయ రహదారి విస్తరణలో భాగంగా చేర్యాల పట్టణంలోని గాంధీ చౌరస్తా వద్ద సంబంధితశాఖ అధికారులు చేపట్టిన బ్రిడ్జి నిర్మాణ పనులను వెంటనే పూర్తిచేయాలని మున్సిపల్ కమిషనర్ నాగేందర్ కోరారు. సోమవారం మున్సిపాలిటీలోని వార్డుల పర్యటన సందర్భంగా ఆయన వంతెన నిర్మాణ పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా కమిషనర్ పనులు నిర్వహిస్తున్న కాంట్రాక్టర్‌తో పనుల పురోగతి పై ఆరా తీయడంతో పాటు వచ్చే వర్షాకాలాన్ని దృష్టిలో పెట్టుకుని నిర్ణీత సమయంలో పనులు పూర్తిచేయాలన్నారు.పనులు ఆలస్యంగా కొనసాగుతుండడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని, వెంటనే పనులు పూర్తి చేస్తే అన్నివర్గాలకు వసతి చేకూరుతుందన్నారు.ఇటీవల కురిసిన వర్షాల వల్ల నిలిచిపోయిన నీటిని తొలిగించేందుకు డీ వాటరింగ్ పంపు ఏర్పాటు చేసి నిల్వ నీటిని తీసివేయాలని సూచించారు. కార్యక్రమంలో మున్సిపల్ అధికారులు, సిబ్బంది, వార్డు అధికారులు పాల్గొన్నారు.

చేర్యాలలో బ్రిడ్జి నిర్మాణ పనులను పరిశీలిస్తున్న కమిషనర్ నాగేందర్

వైభవంగా వేణుగోపాలస్వామి రథోత్సవం

వర్గల్‌లో స్వామివారి రథోత్సవంలో పాల్గొన్న భక్తులు

వర్గల్,మే19: మండల కేంద్రంలో వేణుగోపాలస్వామి రథోత్సవం సోమవారం ఉదయం వైభవంగా జరిగింది. ఆలయ పాలక కమిటీ సభ్యులు ఏర్పాట్లు చేశారు. విమాన రథం ఊరేగింపునకు ముందు దేవతామూర్తులను మెదక్, మల్కాజిగిరి ఎంపీలు మాధవనేని రఘునందన్‌రావు, ఈటల రాజేందర్, ఎఫ్‌డీసీ మాజీ చైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డి, మండల మాజీ ప్రజాప్రతినిధులు, ఆయా పార్టీల నాయకులు, వర్గల్ పరిసర ప్రాంతాల నుంచి భక్తులు తరలివచ్చి స్వామివారిని దర్శించుకున్నారు. గీతజ్ఞానమండలి సభ్యులు,ఆలయ ధర్మకర్తలు భక్తులకు ఇబ్బందులు తలెత్తకుండా ఏర్పాట్లు చేశారు.

28న కిడ్స్ అథ్లెటిక్స్ ఎంపికలు

సిద్దిపేట కమాన్, మే 19 : జిల్లా అథ్లెటిక్స్ సంఘం ఆధ్వర్యంలో ఈ నెల 28న ఉదయం 8 గంటలకు సిద్దిపేటలోని స్టేడియంలో అండర్ – 8, 10,12 విభాగాల్లో బాలబాలికలకు ఎంపికలు ఉంటాయని జిల్లా అథ్లెటిక్స్ సంఘం అధ్యక్ష, కార్యదర్శులు గ్యాదరి పరమేశ్వర్, కర్రోళ్ల వెంకట స్వామిగౌడ్ తెలిపారు. పోటీల్లో మొదటి మూడు స్థానాలు సాధించిన వారికి ప్రశంసాపత్రాలు, పతకాలు, పాల్గొన్న వారికి ప్రశంసాపత్రాలు అందజేస్తామన్నారు. ప్రతిభ కనబర్చిన వారిని జిల్లా జట్టుకు ఎంపిక చేస్తామన్నారు. వీరు జూన్ 1న జింఖానాగ్రౌండ్‌లో జరిగే రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొంటారన్నారు. ఆసక్తి గలవారు ఈ నెల 27న సాయంత్రంలోపు రిజిస్ట్రేషన్ చేయించుకోవాలన్నారు. వివరాల కోసం సెల్: 8501977079, 9704061543 నంబర్లలో సంప్రదించాలన్నారు.

నేరాలు నియంత్రించాలని ఏసీపీకి వినతి

హుస్నాబాద్‌టౌన్,మే 19: హుస్నాబాద్‌లో పెరిగిపోతున్న నేరాలపై పోలీసుల నిఘాపెంచాలని కోరుతూ జాతీయ మానవ హక్కుల సంఘం జిల్లా బాధ్యులు సోమవారం ఏసీపీ సదానందానికి వినతిపత్రం అందజేశారు. ఏసీపీ కార్యాలయంలో నూతనంగా బాధ్యతలు చేపట్టిన హుస్నాబాద్ ఏసీపీ సదానందాన్ని వారు సన్మానించారు. ఈసందర్భంగా పట్టణంలో గంజాయి తదితర మత్తు పదార్థాలపై పోలీసుల నిఘాపెంచాలని, అసాంఘిక కార్యకలాపాలు జరగకుండా చర్యలు చేపట్టాలని వారు కోరారు. పట్టణంలోని అంబేద్కర్‌చౌరస్తాలో ట్రాఫిక్ నియంత్రణకు సంబంధించి ప్రత్యేకంగా కానిస్టేబుల్‌ను నియమించాలని, హుస్నాబాద్ పశువుల సంతలో మొబైల్‌ఫోన్ల దొంగతనాలు, ఇసుక మాఫియాను అరికట్టాలని ఏసీపీని కోరారు. జాతీయ మానవ హక్కుల సంఘం జిల్లా అధ్యక్షుడు భూశంకరాచారి, జిల్లా ప్రధాన కార్యదర్శి రమేశ్, గౌరవ సలహాదారుడు సాయన్న, జిల్లా లీగల్ అడ్వైజర్ ఇల్లెందుల తిరుపతి, జిల్లా కన్వీనర్ వరయోగుల వెంకటేశ్వరస్వామి, లక్ష్మణ్, వేముల వెంకటరమణ, సంపత్, శ్రీదేవి పాల్గొన్నారు.

హుస్నాబాద్‌లో నూతనంగా బాధ్యతలు చేపట్టిన ఏసీపీ సదానందాన్ని సన్మానిస్తున్న జాతీయ మానవహక్కుల సంఘం జిల్లా సభ్యులు

అర్జీలను త్వరగా పరిష్కరించాలి

సిద్దిపేట,మే19: ప్రజావాణిలో భాగంగా వచ్చిన అర్జీలను త్వరగా పరిష్కరించాలని కలెక్టర్ మనుచౌదరి అధికారులను ఆదేశించారు. సోమవారం సమీకృత జిల్లా కార్యాలయ సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణిలో అదనపు కలెక్టర్లు గరిమాఅగర్వాల్, అబ్దుల్‌హమీద్‌తో కలిసి ఆయన దరఖాస్తులు స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజలు తమ సమస్యలు పరిష్కారమవుతాయనే నమ్మకంతో ప్రజావాణికి వచ్చి ఫిర్యాదులు ఇస్తారని వాటిని అధికారులు క్షుణ్ణంగా పరిశీలించి వెంటనే పరిష్కరించే దిశగా కృషిచేయాలన్నారు. వివిధ సమస్యలపై ప్రజల నుంచి మొత్తం 69 దరఖాస్తులు వచ్చాయి. ఈ కార్యక్రమంలో డీఆర్‌వో నాగరాజమ్మ, డీఆర్డీవో పీడీ జయదేవ్ ఆర్యా, అధికారులు పాల్గొన్నారు.

ప్రజల నుంచి అర్జీలు స్వీకరిస్తున్న కలెక్టర్ మనుచౌదరి

ఇతర జిల్లాలకు ఇసుక తరలించడం సరికాదు

బెజ్జంకి, మే 19: స్థానిక అవసరాలకు కాకుండా అనుమతుల పేరుతో గాగిల్లాపూర్‌లోని మోయతుమ్మెదవాగు నుంచి ఇతర జిల్లాలకు ఇసుక తరలించడం సరికాదని బీఆర్‌ఎస్ మండలాధ్యక్షుడు పాకాల మహిపాల్ రెడ్డి అన్నారు. మండల కేంద్రంలో సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. అధికార పార్టీ నాయకుల అండదండలతో ఇసుకను అక్రమంగా తరలిస్తున్నారని ఆరోపించారు. ఇంటి నిర్మాణం లేకున్నా కొంతమందికి అధికారులు ఇసుక తరలింపు కోసం అనుమతి ఇవ్వడం సిగ్గుచేటన్నారు. కొన్ని సందర్భాల్లో అక్రమ ఇసుక నిల్వలను అధికారులు గుర్తించి పట్టుకున్నా ఆ డంపులను బహిరంగ వేలం వేయడం లేదని మండిపడ్డారు. గాగిల్లాపూర్ ఇసుకను ఇతర ప్రాంతాలకు తరలించడం వెంటనే ఆపాలని లేకుంటే ప్రజల పక్షాన పోరాడుతామని ప్రభుత్వాన్ని హెచ్చరించారు. సమావేశంలో నాయకులు లింగాల లక్ష్మణ్, కనగండ్ల తిరుపతి,కచ్చు రాజయ్య, తిరుపతిరెడ్డి, గుబిరే మల్లేశం, ఎలుక దేవయ్య, ఎల శేఖర్‌బాబు, బిగుల్ల మోహన్, కల్లూరి రమేశ్, శంకర్ పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న బీఆర్‌ఎస్ మండలాధ్యక్షుడు మహిపాల్‌రెడ్డి

మానవ తప్పిదంతోనే సైబర్ నేరాలు

చేర్యాల, మే 19 : మానవ తప్పిదంతోనే సైబర్ నేరాలు ఎక్కువగా జరుగుతున్నాయని ఎస్సై నిరేశ్ , ప్రొబెషనరీ ఎస్సై సమత అన్నారు. మండలంలోని దానంపల్లి గ్రామాన్ని సోమవారం వారు సందర్శించి గ్రామ ప్రజలకు ట్రాఫిక్ నిబంధనలు, రోడ్డు నిబంధనలు, సైబర్ నేరాలు, సామాజిక రుగ్మతల పై అవగాహన కల్పించారు. అనంతరం వారు మాట్లాడుతూ మద్యం తాగి వాహనాలు నడుపవద్దని, కారు నడిపేవారు తప్పక సీటు బెల్ట్ పెట్టుకోవాలని, హెల్మట్ వాడకం వల్ల ప్రమాదం తప్పించుకోవచ్చన్నారు. గుర్తు తెలియని వ్యక్తులు వాట్సాప్‌కు లింకులు పంపిస్తే ఆలింకులను ఓపెన చేసి వివరాలు పంపవద్దన్నారు. ప్రజలు అప్రమత్తంగా ఉంటే సైబర్ నేరాలను అరికట్టవచ్చన్నారు.

సప్లిమెంటరీ పరీక్షల నిర్వహణలో జాగ్రత్తలు అవసరం

సిద్దిపేట, మే 19 : ఇంటర్మీడియెట్ సప్లిమెంటరీ పరీక్షలు గురువారం నుంచి ప్రారంభం కానున్న నేపథ్యంలో నిర్వహణకు జాగ్రత్తలు అవసరమని జిల్లా ఇంటర్మీడియెట్ విద్యాధికారి రవీందర్‌రెడ్డి సూచించారు. ఇంటర్మీడియెట్ సప్లిమెంటరీ పరీక్షల నిర్వహణ – నిబంధనలపై సోమవారం సిద్దిపేట ప్రభుత్వ జూనియర్ కళాశాలలో చీఫ్ సూపరింటెండెంట్లు, డిపార్ట్మెంటల్ అధికారులు, స్క్వాడ్ బృందాలు, కస్టోడియన్లతో ఆయన సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉదయం మొదటి సంవత్సరం, మధ్యాహ్నం రెండో సంవత్సరం విద్యార్థులకు సప్లిమెంటరీ పరీక్షలు ఉంటాయన్నారు. విద్యార్థులకు తాగునీటి సౌకర్యం కల్పించాలన్నారు. ప్రతి పరీక్షా కేంద్రం వద్ద ఓఆర్ఎస్ ప్యాకెట్లు అందుబాటులో ఉండేలా చూడాలని వైద్య సిబ్బందికి సూచించారు. డీఈసీ మెంబర్లు జ్యోతి, దేవయ్య మాట్లాడారు. కార్యక్రమానికి పలు కళాశాలల ప్రిన్సిపాళ్లు హాజరయ్యారు.

మాట్లాడుతున్న డీఐఈవో రవీందర్‌రెడ్డి

పుస్తెమట్టెలు అందజేత

సిద్దిపేట టౌన్,మే 19: నిరుపేద వధువు వివాహానికి వాసవి క్లబ్ అండగా నిలిచింది.పట్టణానికి చెందిన నర్సింహులు,కవిత కూతురు లచ్చవ్వ వివాహానికి కోర్తివాడ లక్ష్మణ్ సహకారంతో సోమవారం క్లబ్ అధ్యక్షుడు మురంశెట్టి కుమార్ పుస్తెమట్టెలు అందజేశారు. కార్యక్రమంలో క్లబ్ సభ్యులు పాల్గొన్నారు.

పుస్తెమట్టెలు అందజేస్తున్న క్లబ్ ప్రతినిధులు

లయన్స్ క్లబ్ సేవలు విస్తృతం చేస్తాం

గజ్వేల్, మే 19: లయన్స్ క్లబ్ సేవలను ప్రజలకు చేరువయ్యేలా చేపట్టామని, రాబోయే రోజుల్లో సేవా కార్యక్రమాలను మరింత విస్తృతం చేస్తామని లయన్స్ క్లబ్ రీజినల్ చైర్మన్ గోలి సంతోష్‌గుప్తా అన్నారు. సోమవారం పట్టణంలో నిర్వహించిన సాధారణ సమావేశానికి ఆయన హాజరై మాట్లాడారు. ఇప్పటి వరకు వివిధ కార్యక్రమాలు చేపట్టామన్నారు. సేవా కార్యక్రమాలకు ప్రతిరూపం లయన్స్ క్లబ్ అని కొనియాడారు. దుర్గాప్రసాద్, రాంఫణిధర్, పరమేశ్వరచారి, మల్లేశం, కుమారస్వామి పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న లయన్స్ క్లబ్ రీజినల్ చైర్మన్ గోలి సంతోష్‌గుప్తా

సిద్దిపేట వాసవి క్లబ్ సిల్వర్ జూబ్లీ వేడుకలు

సన్మానం పొందిన క్లబ్ అధ్యక్షులు

సిద్దిపేట టౌన్,మే 19 : యాదగిరిగుట్ట ఆర్యవైశ్య సత్రంలో వాసవి క్లబ్ సిల్వర్ జూబ్లీ వేడుకలు సోమవారం జరిగాయి.ఈ సందర్భంగా సిద్దిపేట వాసవి క్లబ్ ఏర్పడి 25 ఏండ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా అప్పటి నుంచి ఇప్పటి వరకు అధ్యక్షులుగా సేవలు అందించిన వారిని క్లబ్ ఇంటర్నేషనల్ అధ్యక్షుడు రామకృష్ణ సత్కరించారు.

ఉచిత వైద్య శిబిరానికి స్పందన

మద్దూరు(ధూళిమిట్ట) మే19: మద్దూరులోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శంకర దవాఖాన హైదరాబాద్ ఆధ్వర్యంలో సోమవారం ఏర్పాటు చేసిన ఉచిత కంటి వైద్య శిబిరానికి ప్రజల నుంచి విశేష స్పందన లభించింది. 202 మందికి నేత్ర వైద్యులు కంటి పరీక్షలు నిర్వహించగా శస్త్ర చికిత్స కోసం 46 మందిని శంకర దవాఖానకు పంపించారు. కార్యక్రమంలో మద్దూరు, లద్నూర్ పీహెచ్‌సీల వైద్యాధికారులు డాక్టర్ రజిత, డాక్టర్ మహేందర్, పీహెచ్ఎన్ సులోచన, ఎంఎల్‌హెచ్‌పీఎస్ స్టువర్ట్‌సన్, గౌతమి, ఎంపీహెచ్ఏ రఘు, శంకర దవాఖాన ఔట్ రిచ్ అడ్మినిస్ట్రేటర్ భూక్యా బాలరాజు, నేత్ర వైద్యుడు చైతన్య, సిబ్బంది పాల్గొన్నారు.

కంటి శస్త్ర చికిత్స కోసం బస్సులో జనాలను తరలిస్తున్న వైద్యాధికారులు

అలయన్స్ క్లబ్ ఇంటర్నేషనల్ కమిటీ చైర్‌పర్సన్‌గా వనజ

సిద్దిపేట టౌన్,మే 19 : అలయన్స్ క్లబ్ ఇంటర్నేషనల్ కమిటీ చైర్‌పర్సన్‌గా సిద్దిపేటకు చెందిన సోమవనజ నియామకమైంది.ఈమేరకు క్లబ్ ఇంటర్నేషనల్ ప్రెసిడెంట్ రాజ్‌కుమార్ సక్సేనా సోమవారం నియామక పత్రాన్ని అందజేశారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ..తెలంగాణ నుంచి తొలి మహిళా చైర్‌పర్సన్‌గా ఎంపిక కావడం సంతోషంగా ఉందన్నారు.

మద్యం ధరలు పెంచడం దారుణం

హుస్నాబాద్‌టౌన్, మే 19: ప్రభుత్వం మద్యం ధరలు పెంచడం దారుణమని బీఆర్ఎస్ హుస్నాబాద్ అధికార ప్రతినిధి అయిలేని మల్లికార్జున్‌రెడ్డి సోమవారం ఒక ప్రకటనలో విమర్శించారు. అధికారంలోకి రాకముందు ధరలు పెంచమని ప్రకటించిన కాంగ్రెస్ ప్రభుత్వం తీరా పన్నులపేరుతో ప్రజలపై పెనుభారం మోపుతున్నదన్నారు. రాష్ట్ర ఆదాయం పెంచడం కోసం మద్యం ధరలు పెంచడం ఏమిటని ప్రశ్నించారు.

హనుమాన్ స్వాముల శోభాయాత్ర



గురువన్నపేటలో హనుమాన్ మాల దీక్షస్వాములకు పండ్లు, పాలు అందజేస్తున్న మైనార్టీ నాయకుడు అర్షద్‌అలీ

పాదయాత్రగా బయలుదేరిన హనుమాన్ స్వాములు

దాచారంలో శోభాయాత్ర నిర్వహిస్తున్న హనుమాన్ మాలదీక్ష స్వాములు

కోహెడ, మే 19: మండలంలోని శనిగరంలో సోమవారం హనుమాన్ భక్తులు శోభాయాత్ర నిర్వహించారు. మాజీ సర్పంచ్ కర్ర రవీందర్ శోభాయాత్రను ప్రారంభించారు. స్వాములు హనుమాన్ విగ్రహాన్ని పల్లకీలో ఉంచి భజనలతో ఊరేగింపు నిర్వహించారు.

కొండగట్టుకు బయలుదేరిన హనుమాన్ స్వాములు

మండల కేంద్రానికి చెందిన ఎనిమిది మంది హనుమాన్ స్వాములు సోమవారం ఉదయం కొండగట్టుకు కాలినడకన బయలుదేరి వెళ్లారు. స్థానిక హనుమాన్ దేవాలయంలో పూజలు చేసి వెళ్తుండగా కుటుంబ సభ్యులు మంగళహారతులతో సాగనంపారు. జై శ్రీరామ్, జై హనుమాన్ అంటూ స్వాములు వెళ్తుంటే ప్రజలు ఆసక్తిగా తిలకించారు.

ఐనాపూర్‌లో

కొమురవెల్లి, మే 19 : మండలంలోని ఐనాపూర్‌లో ఆదివారం రాత్రి హనుమాన్ మాల దీక్షదారులు హనుమాన్ శోభయాత్ర నిర్వహించారు. ఈ సందర్భంగా హనుమాన్ ఉత్సవ విగ్రహాన్ని పల్లకీలో గ్రామంలోని ప్రధాన వీధుల గుండా వెళ్లగా మహిళలు మంగళహారతులతో స్వాగతం పలికారు.

మతసామరస్యాన్ని చాటుకున్న మైనార్టీ నాయకుడు

మండలంలోని గురువన్నపేటలో బీఆర్‌ఎస్ మైనార్టీ విభాగం మండలాధ్యక్షుడు ఎండీ.అర్షద్ అలీ సోమవారం హనుమాన్ మాల దీక్షదారులకు పండ్లు, పాల భిక్ష ఏర్పాటు చేసి మతసామరస్యాన్ని చాటుకున్నాడు. ఈ సందర్భంగా అర్షద్‌అలీని గ్రామస్తులు అభినందించారు.

దాచారంలో...

బెజ్జంకి, మే 19: హనుమాన్ మాలధారణ స్వాములు మండలంలోని దాచారంలో సోమవారం శోభాయాత్ర నిర్వహించారు. ఈ సందర్భంగా హనుమాన్ దేవుడి ప్రతిమను పల్లకీలో గ్రామంలోని ప్రధాన వీధులగుండా ఊరేగింపు నిర్వహించారు. స్వామివారికి భకులు కొబ్బరికాయులు కొట్టి, మంగళహారతులు ఇచ్చి స్వాగతం పలికారు.

అనుమతి లేని పాఠశాలపై కలెక్టర్‌కు ఫిర్యాదు

చేర్యాల, మే 19 : పట్టణంలోని శుభోదయ పాఠశాల పేరిట రెండేండ్లుగా శ్రీ చైతన్య పాఠశాల అనుమతి లేకుండా కొనసాగుతున్నదని, దానిపై చర్యలు తీసుకోవాలని ఏఐఎస్ఎఫ్ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ రామగల్ల నరేశ్, మండల కార్యదర్శి ఎస్‌కే యాసిన్ సోమవారం కలెక్టర్ మనుచౌదరికి ఫిర్యాదు చేశారు. అనంతరం చేర్యాలలో వారు విలేకరులతో మాట్లాడారు. గతంలో మూసివేసిన పాఠశాల పేరిట రెండేండ్లుగా శ్రీ చైతన్య పాఠశాల అధిక ఫీజులు వసూలు చేస్తూ దోపిడీ కొనసాగిస్తున్నా విద్యాశాఖ అధికారులు పట్టించుకోవడం లేదన్నారు.నిబంధనలకు విరుద్ధంగా కొనసాగుతున్న పాఠశాలపై చర్యలు తీసుకోవాలని జిల్లా, డివిజన్, మండల విద్యాశాఖ అధికారులకు గతంలో పలుమార్లు ఫిర్యాదు చేసినా వారు పట్టించుకోవడం లేదన్నారు.కలెక్టర్ స్పందించి తగు విచారణ జరిపి త్వరలో ప్రారంభం కానున్న విద్యా సంవత్సరంలో అడ్మిషన్లు నిలిపివేయాలని డిమాండ్ చేశారు.కార్యక్రమంలో గిరిక అభినయ్ పాల్గొన్నారు.

వేచరేణిలో చోరీ

చేర్యాల, మే 19 : మండలంలోని వేచరేణిలో ఆదివారం రాత్రి తాళాలు వేసి ఉన్న ఇండ్లల్లో దొంగలు చోరీకి పాల్పడినట్లు గ్రామస్తులు తెలిపారు.గ్రామానికి చెందిన ఏగుర్ల యాదవ్వ ఇంట్లో తాళం పగులగొట్టి బీరువాలో ఉన్న రెండు తులాల బంగారు ఆభరణాలు, 20 తులాల వెండి ఆభరణాలు ఎత్తుకుపోయారు. ఎగుర్ల ఎల్లయ్యకు చెందిన బైక్, ఎగుర్ల యాదయ్యకు చెందిన ఎక్సెల్ 100ను చోరీ చేశారు. మెర్గోజు శశిరేఖకు చెందిన ఇంట్లో పావు తులం బంగారు ఆభరణంతో పాటు నగదు ఎత్తుకుపోయినట్లు గ్రామస్తులు తెలిపారు.వేచరేణి గ్రామం కొమురవెల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలోకి రావడంతో బాధితులు పోలీసులను ఆశ్రయించారు.కాగా గ్రామాన్ని సీఐ శ్రీను, కొమురవెల్లి ఎస్సై రాజు, సిబ్బంది సందర్శించి చోరీలు జరిగిన తీరును పరిశీలించడంతో పాటు బాధితులను వివరాలు అడిగి తెలుసుకున్నారు.

అడిగిన వెంటనే ట్రాన్స్‌ఫార్మర్ మంజూరు

నంగునూరు, మే 19 : అడిగిన అరగంటలోనే స్పందించి కొత్త ట్రాన్స్‌ఫార్మర్ మంజూరు చేయించడంతో గ్రామస్తులు సంతోషం వ్యక్తం చేశారు. వివరాలిలా ఉన్నాయి. మండల కేంద్రంలోని చౌడుచెరువు కట్టవద్ద ఉన్న 63కేవీ ట్రాన్స్‌ఫార్మర్ లోడ్ సరిపోక తరుచూ విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుంది. ఈ విషయం తెలుసుకున్న బీఆర్ఎస్ యువ నాయకులు మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్‌రావు దృష్టికి తీసుకువెళ్లగా స్పందించిన ఆయన విద్యుత్ అధికారులతో మాట్లాడి వెంటనే 100 కేవీ ట్రాన్స్‌ఫార్మర్‌ను మంజూరు చేయించి సిబ్బందితో బిగించారు. ఈ మేరకు గ్రామస్తులు మాజీ మంత్రి హరీశ్‌రావు, అధికారులకు కృతజ్ఞతలు తెలిపారు.

ఎస్సీ , ఎస్టీ మానిటరింగ్ కమిటీ ఏర్పాటు చేయాలి

సిద్దిపేట టౌన్,మే 19 : జిల్లాలో ఎస్సీ,ఎస్టీ విజిలెన్స్ మానిటరింగ్ కమిటీ ఏర్పాటు చేయాలని మల మహానాడు వ్యవస్థాపక అధ్యక్షుడు కొదాది శ్రీనివాస్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సిద్దిపేటలో సోమవారం ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ ఉన్నా జిల్లాలో ఇంతవరకు ఎస్సీ,ఎస్టీ మానిటరింగ్ కమిటీ ఏర్పాటు చేయకపోవడం ఏమిటని ఆయన ప్రశ్నించారు. కలెక్టర్, షెడ్యూల్ కులాల అభివృద్ధి శాఖ అధికారి ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి 17 నెలలు గడుస్తున్నా జిల్లాలో ఎస్సీ, ఎస్టీ విజిలెన్స్ కమిటీ ఏర్పాటు చేయడంలో విఫలమైందని విమర్శించారు. జిల్లాలో ప్రతి నెలా 30న నిర్వహించాల్సిన పౌరహక్కుల డేను అధికారులు విస్మరించారన్నారు. ప్రభుత్వం సామాజిక ఉద్యమకారులతో ఎస్సీ,ఎస్టీ విజిలెన్స్ మానిటరింగ్ కమిటీ ఏర్పాటు చేస్తే దళితులపై జరుగుతున్న దాడులను అరికట్టవచ్చన్నారు.

నేటి నుంచి టీచర్లకు వృత్యంతర శిక్షణ

దుబ్బాక,మే19: దుబ్బాక మున్సిపల్ పరిధిలోని లచ్చపేట మోడల్ స్కూల్‌లో మంగళవారం నుంచి 24వతేదీ వరకు మండల స్థాయి టీచర్లకు వృత్యంతర శిక్షణ నిర్వహిస్తున్నట్లు ఎంఈవో ప్రభుదాస్ తెలిపారు. ఉదయం తొమ్మిది నుంచి సాయంత్రం ఐదు గంటల వరకు శిక్షణ కొనసాగుతుందని ఆయన తెలిపారు.

మద్దూరులో

మద్దూరు(ధూళిమిట్ట), మే19: మద్దూరులోని మోడల్ స్కూల్‌లో మంగళవారం నుంచి మద్దూరు, ధూళిమిట్ట మండలాల ప్రాథమిక స్థాయి ఉపాధ్యాయులకు శిక్షణ ఏర్పాటు చేసినట్లు మద్దూరు, ధూళిమిట్ట మండలాల ఎంఈవోలు వరదరాజు, మీనాంజనేయులు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. 20 నుంచి 24 రోజుల పాటు ఈశిక్షణ కొనసాగుతుందన్నారు.